బుధవారం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0°C
కనిష్ఠం : 20.0°C

'వరంగల్'పై సీపీఐ నజర్

- పొత్తులో భాగంగా ఈ స్థానం, లేదంటే ఖమ్మం ఇవ్వాలని డిమాండ్
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో ఇటీవల సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా భేటీ
- గతంలో వరంగల్ నుంచి గెలిచామంటున్న కమ్యూనిస్టులు
- కూటమి ఒత్తిళ్లతో కాంగ్రెస్‌లో వరంగల్ సీటుపై చర్చ



ఇటీవల ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో భేటీ అయిన సీపీఐ నేత డి.రాజా

వరంగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కమ్యూనిస్టులు వరంగల్‌పై కన్నేశారు. ఇండియా కూటమి పొత్తులో భాగంగా వరంగల్ ఎంపీ స్థానాన్ని తమకు కేటాయించాలని కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తున్నారు. ఈ మేరకు మంగళవారం సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేని కలిసి తెలంగాణలో ఖమ్మం లేదా వరంగల్ స్థానాల్లో ఏదో ఒకటి కేటాయించాలని సీపీఐ పట్టు బడుతోంది. ఇప్పటికే వరంగల్ సీటు కోసం ముగ్గురి పేర్లతో కూడిన జాబితాను కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఏఐసీసీకి పంపించింది. అయితే వరంగల్ సీటుపై సీపీఐ పట్టుబడుతుండటం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది.

వరంగల్ లేదా ఖమ్మం కోసం..

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల నుంచి తమ ప్రాతినిధ్యం ఉండాలని భావిస్తున్న సీపీఐ పొత్తులపై దృష్టి పెట్టింది. గతేడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని సీపీఐ కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసింది. తమ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నుంచి విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టడంతో సీపీఐ దృష్టి ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలపై పడింది. మంగళవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ఢిల్లీలో భేటీ అయ్యారు. దేశవ్యాప్తంగా పొత్తులో భాగంగా తొమ్మిది రాష్ట్రాల్లో ఒక్కొక్క సీటు ఇవ్వాలని ఖర్గేను కోరారు. ఈ మేరకు సీపీఐ ఆశిస్తున్న పార్లమెంట్ స్థానాల జాబితాను ఖర్గేకు అందించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి అనంతపురం ఎంపీ సీటుతో పాటు తెలంగాణలోని ఖమ్మం లేదా వరంగల్ (ఎస్సీ) ఎంపీ స్థానాన్ని కేటాయించాలని ఆ జాబితాలో డి.రాజా కోరారు. ఖమ్మం నుంచి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పోటీ చేస్తారని, వరంగల్ కేటాయిస్తే సీనియర్ జర్నలిస్టు బీఆర్. లెనిన్ పోటీ చేస్తారని కాంగ్రెస్ అధిష్ఠానానికి సీపీఐ నేతలు సమాచారమిచ్చారు. ఏదో ఒక సీటు మాత్రం పక్కగా కేటాయించాలని సీపీఐ నేతలు కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తున్నారు.

కాంగ్రెస్‌లో టెన్షన్

రాష్ట్రంలో మెజార్టీ సీట్లను గెలువాలని లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్‌కు.. సీపీఐ ఓ సీటు కోసం చేస్తున్న ఒత్తిడి చర్చనీయాంశంగా మారింది. సీపీఐ కోరుతున్న ఖమ్మం లేదా వరంగల్‌లో కాంగ్రెస్ పటిష్ఠంగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని కొత్తగూడెం అసెంబ్లీ స్థానాన్ని సీపీఐకి కేటాయించారు. ప్రస్తుతం ఖమ్మం ఎంపీ స్థానాన్ని కూడా సీపీఐకి కేటాయించే పరిస్థితి లేదని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. పైగా ఖమ్మం నుంచి ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ లేదా ప్రియాంకగాంధీల్లో ఒకరు పోటీ చేస్తారని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. గాంధీ కుటుంబం నుంచి పోటీ చేయకపోయినప్పటికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు కూడా పోటీకి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మం సీపీఐకి కేటాయించటం సాధ్యం కాదనే చర్చ వినిపిస్తోంది. ఇక వరంగల్ స్థానంపైనే సీపీఐ గట్టిగా పట్టుబడుతుంది. 1952లో వరంగల్ పార్లమెంట్ ఏర్పడిన కొత్తలో తొలిసారి జరిగిన ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసిన పెండ్యాల రాఘవరావు విజయం సాధించారని, అప్పటి నుంచి తమకు పార్లమెంట్ పరిధిలో గట్టి ఓటు బ్యాంకు ఉందని కమ్యూనిస్టులు పేర్కొంటున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి బొడ్డు అబ్రహం, పరకాల అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోతరాజు సారయ్య ఎమ్మెల్యేలుగా గెలిచారని సీపీఐ నేతలు వివరిస్తున్నారు. భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కోల్‌బెల్ట్‌లో ఏఐటీయూసీ బలంగా ఉందని, పలు మండలాల్లో సీపీఐ కమిటీలు కూడా ఉన్నాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. తమకు పొత్తులో భాగంగా ఒక ఎంపీ సీటు కేటాయించాలని కమ్యూనిస్టులు పట్టుబడుతున్నారు. సీపీఐ పూర్వ వరంగల్ జిల్లా కార్యదర్శిగా పని చేసిన బీఆర్ భగవాన్‌దాస్ కుటుంబం నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలో దించేందుకు సీపీఐ నేతలు కసరత్తు చేస్తోంది. తమకు వరంగల్ సీటు కేటాయిస్తే తమ అభ్యర్థిగా ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఓ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు బీఆర్.భగవాన్‌దాస్ కుమారుడు బీఆర్.లెనిన్‌ను బరిలో దించుతామని సీపీఐ నేతలు ప్రకటిస్తున్నారు. దీంతో వరంగల్ టికెట్ ఆశిస్తున్న నేతల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. వరంగల్ టికెట్ కోసం 42మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో గత ఎన్నికల్లో స్టేషన్‌ఘనపూర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా సింగపురం ఇందిరతో పాటు దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్ పేర్లను ఏఐసీసీకి పంపించారు. వీరిలో ఎవరికి టికెట్ ఇవ్వాలో ఆర్థిక, అంగ బలాలపై పార్టీ అంతర్గత సర్వేలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో సీపీఐ తమకు వరంగల్ సీటు కేటాయించాలని కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తుండటంతో ఆశావహుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

మరోమారు మేడిగడ్డకు ఎన్‌డీఎస్‌ఏ బృందం

- కుంగిన తర్వాత రెండోసారి డ్యామ్‌సేఫ్టీ అథారిటీ బృందం రాక
- ఉదయం మేడిగడ్డ, మధ్యాహ్నం అన్నారం బ్యారేజీల పరిశీలన
- ప్రాజెక్టు లోపాలు, పునరుద్ధరణ అవకాశాలపై అధ్యయనం
- కీలకం కానున్న సిఫారసులు



భూపాలపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) బృందం మరోసారి సందర్శించనుంది. ఈ ప్రాజెక్టులోని పలు పిల్లర్లు కుంగిన తర్వాత రెండోసారి ఇక్కడకు వస్తున్న బృందం కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల లోపాలు మరమ్మతులకు గల అవకాశాలను అధ్యయనం చేసే అవకాశం ఉంది. ఉదయం భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్, మధ్యాహ్నం అన్నారం సరస్వతి బ్యారేజీలను జాతీయ ఆనకట్టల భద్రత విభాగం నిపుణులు పరిశీలించనున్నారు. గతేడాది అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీలోని ఏడోబ్లాకులో పిల్లర్ నెంబర్ 19, 20, 21 కుంగిన విషయం తెలిసిందే. దీంతో మేడిగడ్డ బ్యారేజ్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై రాజకీయంగా ప్రస్తుతం పెద్ద ఎత్తున దుమారం రేగుతోంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతులకు గల అవకాశాలను అధ్యయనం చేసి సిఫారసులు చేయాలని కోరడంతో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నిపుణుల బృందం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఇప్పటికే గత ప్రభుత్వ హయాంలో ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల బృందం ఒక దఫా ప్రాజెక్టును సందర్శించి వెళ్లింది. ఈ పరిణామాల క్రమంలో ప్రభుత్వం మారడం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం రాజకీయ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ఇటీవలే అధికార కాంగ్రెస్, ప్రధాన విపక్షమైన బీఆర్‌ఎస్ నేతలు పోటాపోటీగా ప్రాజెక్టు సందర్శన కార్యక్రమాలు చేపట్టి ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ దెబ్బతిన్న పిల్లర్లను మరమ్మతు చేయాల్సింది పోయి పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసం రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలకు ప్రాజెక్టును అస్త్రంగా వాడుకుంటోందంటూ బీఆర్‌ఎస్ ఎదురుదాడికి దిగడంతో ప్రభుత్వం వీలైనంత తొందరగా ఈ రెండు ప్రాజెక్టుల భవితవ్యాన్ని తేల్చాలంటూ

మిగతా 6వ పేజీలో..

బల్దియాపై హస్తం గురి

- కాంగ్రెస్ గూటికి 10 మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు
- కొండా దంపతుల ఆధ్వర్యంలో చేరికలు
- నేడో, రేపో మేయర్, మరి కొందరు కార్పొరేటర్లు
- జీడబ్ల్యూఎంసీలో మారుతున్న రాజకీయ సమీకరణాలు


హైదరాబాద్‌లో కొండా దంపతుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బల్దియా బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, తూర్పు నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేతలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), మార్చి6: మూడు రోజులుగా ఉత్కంఠ రేపిన కాంగ్రెస్ పార్టీలోకి గులాబీ కార్పొరేటర్ల చేరిక ఎట్టకేలకు బుధవారం ముగిసింది. హైదరాబాద్‌లో మకాం వేసిన గులాబీ కార్పొరేటర్లు మొత్తం పదిమంది కార్పొరేటర్లు ఎం.డి. ఫుర్కాన్, భైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, కావటి కవిత, వస్కుల బాబు, ఓని స్వర్ణలత, బస్వరాజు కుమార్, చింతాకుల అనిల్, ముష్కమల్ల అరుణ సుధాకర్, పోశాల పద్మ, సురేశ్ జోషిలు.. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ గూటికి చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లోకి 20 మంది..

బీఆర్‌ఎస్‌కు చెందిన 10 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ గూటిలోకి రావడంతో మొత్తంగా ప్రస్తుతానికి చేరిన వారి సంఖ్య 20కి చేరింది. నలుగురు కార్పొరేటర్లతో ఉన్న కాంగ్రెస్ బలం తాజా చేరికలతో 24కు పెరిగింది. రెండు నెలల కిందట ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పశ్చిమకు చెందిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు వేములశ్రీనివాస్, మానస రాంప్రసాద్, నెక్కొండ కవిత, చీకటి శారద, మామిళ్ల రాజు, సర్తాజ్ బేగం కాంగ్రెస్‌లో చేరిన సంగతి విదితమే. అంతకుముందే తూర్పు నియోజకవర్గం నుంచి గుండేటి నరేందర్ కాంగ్రెస్‌లో చేరారు. చేరికలతో బల్దియాలో కాంగ్రెస్ కార్పొరేటర్ల బలం 11కు పెరిగింది. రెండు రోజుల కిందట వర్ధన్నపేట పరిధిలోని డివిజన్లకు చెందిన ముగ్గురు కార్పొరేటర్లు విక్టర్ అరుణ, షీబారాణి, తూర్పాటి సులోచన ఎమ్మెల్యే నాగరాజు ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కొండా దంపతుల ఆధ్వర్యంలో 'తూర్పు'లోని 10 మంది కార్పొరేటర్ల చేరికతో మొత్తంగా కాంగ్రెస్‌లో చేరిన గులాబీ కార్పొరేటర్ల సంఖ్య 20కి పెరిగింది.

నేడో, రేపో మేయర్, మరికొందరు కార్పొరేటర్లు

మేయర్ గుండు సుధారాణి సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. అయితే ఈ విషయంలో కొంత రాజకీయ రగడ నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ సుధారాణి చేరిక ఖాయమైనట్లు బలంగా వినిపిస్తోంది. మేయర్ సుధారాణితో పాటు మరి కొందరు కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్ కండువా వేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మరి కొందరు బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరే కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.

మారుతున్న సమీకరణలు

కార్పొరేటర్ల చేరికతో వరంగల్ మహానగర పాలక సంస్థలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి మేయర్‌తో సహా కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరే క్రమంలో బల్దియాను శాసించే స్థాయికి కాంగ్రెస్ చేరింది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు కార్పొరేటర్ల బలం 24 ఉంది. బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల సంఖ్య 32 కాగా, బీజేపీ కార్పొరేటర్లు 10 మంది ఉన్నారు. ఎక్స్ అఫీషియో సభ్యులను మినహాయించి లెక్కలు వేసినా బల్దియా పీఠాన్ని కైవసం చేసుకోవడానికి కాంగ్రెస్‌కు మరో 10 మంది కార్పొరేటర్లే అవసరం. ఈ క్రమంలో బల్దియాను హస్తగతం చేసుకునే దిశగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. మరోవైపు అవిశ్వాస ప్రక్రియే లేకుండా బల్దియా కాంగ్రెస్ వశం కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పక్షంగా బీఆర్‌ఎస్ విపక్షంగా మారనుంది. ఈ పరిణామం బల్దియా చరిత్రలో గతంలో చోటు చేసుకోలేదనే వాదనలు ఉన్నాయి.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న నరేందర్

ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

మట్టెవాడ, మార్చి 6: కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేసేంత వరకు బీఆర్‌ఎస్ పార్టీ ఉద్యమిస్తుందని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. బుధవారం వరంగల్ చౌరస్తాలో ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం భారం మోపడాన్ని నిరసిస్తూ వరంగల్ చౌరస్తాలో కార్పొరేటర్ గందె కల్పనవీన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నరేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పేరిట రూ.20 వేల కోట్ల భారాన్ని మోపుతోందని, ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు మాటతప్పిందని ఆరోపించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు మరుపల్లి రవి, పల్లం పద్మరవి, బోగి సువర్ణసురేశ్, మాజీ మార్కెట్ చైర్మన్ రమేశ్‌బాబు, బీఆర్‌ఎస్ నాయకులు దుబ్బ శ్రీనివాస్, గోరంటల మనోహర్, రంకీయాదవ్, అనిల్‌ఎక్బాల్, కుమార్, భాస్కర్, మోహన్ పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

వర్ధన్నపేట, మార్చి 6 : ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులలో మహాలక్ష్మి పథకంలో ఎల్‌పీజీ గ్యాస్ నెంబరు, గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్ సర్వీస్ నెంబరు తదితర వివరాలను సరిచేసే విధంగా మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాలు, ఆయా మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన కేంద్రం కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. బుధవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులలో మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు సంబంధించిన సరైన వివరాలను నమోదు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాల్లో లబ్ధిదారుల వివరాలను పకడ్బందీగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఫైళ్ల పరిష్కారంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో ధనలక్ష్మి, జడ్పీటీసీ భిక్షపతి, ఎంపీపీ అప్పారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న వేయిస్తంభాల గుడి కళ్యాణ మండపం

రేపు వేయిస్తంభాలగుడి కల్యాణ మండపం ప్రారంభం

- హాజరుకానున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పలువురు రాష్ట్ర మంత్రులు
- పాల్గొననున్న పలువురు మంత్రులు

హనుమకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చరిత్రాత్మక హనుమకొండలోని వేయిస్తంభాలగుడి ఆవరణలోని కల్యాణ మండపాన్ని శివరాత్రి పర్వదినమైన శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరవనున్నారు. ఆయనతో పాటు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి క్రిష్ణారావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ అంబర్ కిశోర్ ఝా, కేంద్ర పురావస్తు శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ అలోక్ త్రిపాఠి, రీజినల్ డైరెక్టర్ పాఠక్ (ఢిల్లీ), సూపరింటెండెంట్ సునీత ఎస్.కుమార్ (హైదరాబాద్), స్థానిక కేంద్ర పురావస్తు శాఖ అధికారి మల్లేశం కూడా పాల్గొననున్నారు. తొలుత శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 8గంటల వరకు శాంతి పూజ జరిగిన అనంతరం మండపాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారం భిస్తారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో రెండు డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేసి.. 2004 నుంచి ఇప్పటి వరకు కల్యాణ మండపం పునర్నిర్మాణం జరిగిన తీరు, అందుకు అనుసరించిన సాండ్‌బాక్స్ టెక్నాలజీ విధానం, తదితర అంశాలను తెలియ చేసేలా ఐదు నుంచి పది నిమిషాల నిడివిగల వీడియోను ప్రదర్శిస్తారు. ఇక శుక్రవారం జరిగే ప్రారంభోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మండపానికి, ఆలయానికి మధ్య ఇన్నాళ్లు ఉన్న గోడ ను పూర్తిగా తొలగించారు. నంది విగ్రహానికి మర మ్మతులు చేశారు.

నేడు ఖిలావరంగల్‌కు కిషన్‌రెడ్డి

ఖిలావరంగల్ : కేంద్ర పర్యాటక శాఖామంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖమంత్రి జూపల్లి క్రిష్ణారావు గురువారం ఖిలావరంగల్‌లో పర్యటిస్తారని కేంద్రపురావస్తు శాఖ వరంగల్ జిల్లా అధికారి ఎం.మల్లేశం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకతీయుల కళాఖండాలు, కట్టడాల ముందు ఇండియన్ ఆయిల్ ఫౌండేషన్ (ఐఓఎఫ్) ఆధ్వర్యంలో రూ.3కోట్లతో ఏర్పాటు చేసిన చేసిన విద్యుత్‌దీపాలను ఆయన ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈ మేరకు బుధవారం రాత్రి మధ్యకోటలో విద్యుద్దీపాల ట్రయల్ రన్ పూర్తిచేశారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా(కేంద్ర పురావస్తు శాఖ) ఆధ్వర్యంలో మధ్యకోటలోని కాకతీయ రాజుల నిర్మించిన నాలుగు కీర్తి తోరణాలు, కళాఖండాలు, రాతికట్టడాలకు విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేశారు. వాటిని రాత్రి వేళల్లో తిలకించేందుకు విద్యుత్‌దీపాలను అమర్చారు. దీంతో కోట మరింత అందంగా మారనుంది.

మేడారం ఆదాయం రూ.13.25కోట్లు

పూర్తయిన అన్నికానుకల లెక్కింపు.. ఏడు రోజుల కౌంటింగ్‌కు తెర

హనుమకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ద్వారా ఈ సారి మొత్తం రూ.13,25,22,511 కోట్ల ఆదాయం వచ్చిందని ఈవో రాజేంద్రం తెలిపారు. హుండీల లెక్కింపు మంగళవారమే పూర్తికాగా బుధవారం పసుపు, కుంకుమ, బెల్లంతో తడిసి ముద్దయిన నోట్లు, నాణాలను లెక్కించగా రూ.53,43,231గా తేలింది. ముద్దయిన నోట్లను సబ్బు నీళ్లలో నానబెట్టి శుభ్రం చేశారు. ఆరిన తర్వాత ఇస్త్రీ చేసి తిరిగి పూర్వరూపానికి తీసుకువచ్చారు. ఈసారి నాణాలు పెద్దమొత్తంలో వచ్చాయి. అయిదు పెద్ద నీళ్ల ప్లాస్టిక్ డమ్ములు నిండాయి. వీటిని డినామినేషన్ల ప్రకారం వేరు చేశారు. వాటిని బ్యాంకు అధికారుల సమక్షంలో తూకం వేసి లెక్కకట్టారు. నోట్లతో పాటు నాణాలను బ్యాంకులో జమ చేశారు. అన్నిటి లెక్కింపు పూర్తయినందువల్ల బుధవారంతో ఏడురోజుల పాటు సాగిన కౌంటింగ్‌కు తెరపడిందని సమ్మక్క సారలమ్మ జాతరు ఈవో రాజేంద్రం తెలిపారు.

ఫిబ్రవరి 29నుంచి హుండీలలెక్కింపు ప్రారంభమైంది. లెక్కింపులో మొత్తం 350 మంది దేవాదాయ, రెవెన్యూ, పోలీసు సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు. లెక్కింపులో పాల్గొన్నవారు డ్రెస్‌కోడ్ పాటించారు. లెక్కింపు సందర్భంగా ఎలాంటి అక్రమాలు, పొరపాట్లు జరగకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రం చుట్టూరా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రం లోపల, బయట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లెక్కించిన నగదును ఎప్పటికప్పుడు బ్యాంకులో జమచేశారు. నగదును, బంగారం, వెండి బంగారం కానుకలను చివర మదింపువేసి బ్యాంకులాకర్‌లో భద్రపరిచారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయ శాఖల సహకారంతో సీసీ కెమెరాల నిఘా మధ్య హుండీల లెక్కింపు ఏడు రోజుల పాటు ప్రశాంతవాతారణంలో నిర్వహించారు. ఈ సారి హుండీల్లోని నాణాలు, బంగారం, వెండి వస్తువులను జల్లెడ పట్టడానికి ప్రత్యేకంగా ఒక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. దీనివల్ల హుండీల లెక్కింపు వేగవంతగా జరిగింది. గతంలో హుండీల లెక్కింపు పూర్తయ్యేసరికి పది, పదకొండు రోజుల పట్టేది. ఈ సారి ఆరు రోజుల్లో పూర్తి చేశారు. బుధవారంతో మొత్తం 540 హుండీలను లెక్కించారు. నగదుతో పాటు హుండీల్లో భక్తులు వేసిన బంగరు, వెండి కానుకలను కూడా తూకం వేసి వాటి విలువను మదింపు వేశారు.

వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

- పంట నష్టం రూ.180 కోట్ల దాకా
- సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.



నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా


నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు

నేడు ప్రధాని శంకుస్థాపన

హైదరాబాద్/వికారాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.137.76 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో చేపట్టనున్న నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు. ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం, భువనగిరి జిల్లాలోని భువనగిరి కోట, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టే వివిధ అభివృద్ధి పనులను మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద దేశ వ్యాప్తంగా 52 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసిన కేంద్రం దాదాపు రూ.1325.76 కోట్ల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.38.90 కోట్లు కేటాయించింది. అలాగే, భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరితవనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మాణానికి తొలి దశలో రూ.56.81 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలు, అక్కడి అటవీ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.38 కోట్లు కేటాయించారు. ఆయా పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.98 కోట్లతో అభివృద్ధి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగునీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్ హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారనికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్లు మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్ల మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

కాలుష్య నియంత్రణ బోర్డులో

అవినీతి అధికారులు

- మండిపడిన హైకోర్టు
- సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ఫ్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీచేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. చట్టంలోని నిబంధన ప్రకారం ప్లాస్టిక్ వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చింది. కంపెనీ ఇచ్చిన వివరణను పట్టించుకోకుండా, తమ నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. మూసివేత ఆదేశాలను సవాల్ చేస్తూ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ' రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఇదో బాధాకరమైన విషయం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా మార్చాలి. గత ఏడునెలలుగా మేం పీసీబీ పనితీరును గమనిస్తున్నాం. కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు.. మరి కొంత మంది అధికారులు వచ్చి ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి ' అని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీచేసిన మూసివేత ఉత్తర్వులు చెల్లవని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ రాజకీయం!

- కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని... ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్‌ఎస్ బలహీనపడింది

- పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా... అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్‌ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటర్ల వివరాలు ఇవ్వండి

- ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఇంటినంబర్లతో కూడిన మ్యాప్ (నజ్రీ నక్ష)లను మాజీ ఎంపీ, ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అందజేయాలని ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ గతేడాది జారీచేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం నజ్రీ నక్ష అందజేయాల్సి ఉండగా అందుకు ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 2.40 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో 1.65 లక్షల మంది వరకు ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఇంటి నెంబర్లతో కూడిన నజ్రీ నక్షలను బయటపెట్టకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ.. ఫొటోలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏరియాను ప్రతిబింబించే నజ్రీ నక్షను ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. తగిన మొత్తంలో రుసుము చెల్లిస్తే పిటిషనర్‌కు నక్ష అందజేయడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఖర్చులు స్వీకరించి పిటిషనర్ కోరిన విధంగా నజ్రీ నక్ష అందజేయాలని ఆదేశించింది.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అధఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే.! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్ల పొదలు, ముళ్ల కంపలు తప్ప. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు

హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బేవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాతాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యూవల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రైవేటు ఏజెన్సీలతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్‌కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్‌కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాటు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించినట్లు ఆరోపణలున్నాయి.



మహిళలను పరిచయం చేసుకుంటున్న శారద

మహిళలకు క్రీడా పోటీలు

వరంగల్ సిటీ, మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి క్రీడా పోటీలను మహిళలకు నిర్వహించారు. ఓసిటీలో నిర్వహించిన ఈ పోటీలను జిల్లా సంక్షేమ అధికారి ఎం.శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, పరుగు పందాలు, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ ఆఫీసర్ సత్యవాణి, సీడీపీవోలు ఎం.విశ్వజా, విద్య, శ్రీదేవి పాల్గొన్నారు.

మిల్స్‌కాలనీ పీఎస్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ



కరీమాబాద్, మార్చి 6: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం సన్నిహిత రిసెప్షన్ కౌంటర్ వద్ద వివరాలు తెలుసుకుని, సిబ్బందిని కేసుల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఉన్న లాకప్ సెల్‌ను పరిశీలించారు. సైబర్ క్రైమ్ నేరాల వివరాలు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, కేడీలు, డీసీలు, రౌడీషీటర్లకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసులతోపాటు, నేరాలు, శాంతి భద్రతల నియంత్రణ కోసం ముందస్తుగా తీసుకుంటున్న చర్యలపై సీపీ సీఐ మల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. అలాగే శాఖపరమైన సమస్యలపై సిబ్బందిని సీపీ ఆరాతీశారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ ఉన్నారు.

ప్రశాంతంగా సాగుతున్న ఇంటర్ పరీక్షలు

వరంగల్ సిటీ, మార్చి 6: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన ఫస్టియర్ పరీక్షకు 95శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విభాగంలో 4,387 మంది విద్యార్థులకు గాను 4,216 మంది హాజరు కాగా, వొకేషనల్ విభాగంలో 895కు గాను 800 మంది మొత్తం 5,282 మందికి గాను 5,016 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 171 మంది గైర్హాజరు కాగా, వొకేషనల్ విభాగంలో 95 మంది మొత్తంగా 266 మంది గైర్హాజరయ్యారు. నగరంలోని రంగశాయిపేట, వివిధ ప్రైవేటు కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను డీఐఈవో కాక మాధవరావు సందర్శించి పరీక్ష విధానాన్ని పరిశీలించారు. కాగా, రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ప్రావీణ్య తనిఖీ చేశారు.

మరోమారు మేడిగడ్డకు ఎన్‌డీఎస్‌ఏ బృందం

3వ పేజీ తరువాయి

డ్యామ్ సేఫ్టీ అథారిటీకి లేఖ రాయడంతో ప్రస్తుతం నిపుణుల కమిటీ అధ్యయనానికి శ్రీకారం చుట్టింది.

బృందం పర్యటన సాగనుందిలా..

కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ అన్నారం బ్యారేజీలను అధ్యయనం చేసేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం గురువారం రోజంతా మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులను సుదీర్ఘంగా అధ్యయనం చేయనుంది. ఉదయం 9గంటలకు ఎన్‌డీఎస్ఏ బృందం మేడిగడ్డ చేరుకొని అల్పాహారం తర్వాత 9.30గంటలకు బ్యారేజీ తనిఖీల ప్రక్రియ ప్రారంభించి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు దెబ్బతిన్న పిల్లర్లు, డిజైన్లలోపాలు, నిర్మాణ నాణ్యత, మరమ్మతులకు గల అవకాశాలు లాంటి అంశాలపై విస్తృతంగా అధ్యయనం చేస్తుంది. మధ్యాహ్నం ఒకటిన్నరకు మేడిగడ్డ వద్ద భోజనం ముగించుకుని రెండున్నర గంటలకు అన్నారం సరస్వతి బ్యారేజ్ వద్దకు చేరుకుంటుంది. మధ్యాహ్నం 3.15 నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకు సరస్వతి బ్యారేజ్‌ని పరిశీలించి నేరుగా రామగుండం వెళుతుంది. ఆ మరుసటి రోజు సుందిళ్ల బ్యారేజ్‌ని తనిఖీ చేయనున్నారు.

నిపుణుల కమిటీ సిఫారసులే కీలకం

దెబ్బతిన్న మేడిగడ్డ అన్నారం బ్యారేజీల భవితవ్యాన్ని ఎన్‌డిఎస్‌ఏ నిపుణుల బృందం ఇచ్చే నివేదికలే తేల్చనున్నాయి. నిపుణుల కమిటీ ప్రధానంగా 19అంశాలపై సమాచారం అడిగినందున తనిఖీలలో వాటి పైనే ప్రధానంగా ఫోకస్ పెట్టే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ప్రాజెక్టు డిజైన్ మొదలు క్వాలిటీ కంట్రోల్, నిర్వహణ లాంటి అంశాలపై దృష్టి సారించే అవకాశం ఉంది. దెబ్బతిన్న ఏడో బ్లాకులోని పిల్లర్ల మరమ్మతులకు ఏ మేరకు అవకాశాలు ఉన్నాయి? మరమ్మతులు చేయిస్తే భవిష్యత్తులో ప్రాజెక్టు పరిస్థితి ఎలా ఉంటుంది? దెబ్బతిన్న పిల్లర్ల స్థానంలో మళ్లీ పునర్నిర్మించాలా? వద్దా? అనే అంశాలను నిపుణులు తేల్చే అవకాశాలున్నాయి.

మహిళా సాధికారితకు బీజేపీ పెద్దపీట

తెలంగాణ అధికార ప్రతినిధి క్రిష్ణప్రసాద్



కాశిబుగ్గలో ప్రత్యేక ప్రసారం వీక్షిస్తున్న క్రిష్ణప్రసాద్

వరంగల్‌టౌన్, మార్చి 6: మహిళా సాధికారితకు బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఆ పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి టి.క్రిష్ణప్రసాద్ (ఐపీఎస్ రిటైర్డ్) అన్నారు. బుధవారం కాశిబుగ్గలో బీజేపీ నాయకులు ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి వెస్ట్‌బెంగాల్ రాష్ట్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నారీ శక్తి వందన్ కార్యక్రమ ప్రసంగం ప్రత్యేక ప్రసారం వీక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో క్రిష్ణప్రసాద్ మాట్లాడుతూ- నారీమణులు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు పావలా వడ్డీ, వడ్డీలేని రుణాలను అందిస్తు ఆర్థిక బలోపేతానికి కేంద్ర కృషి చేస్తోందన్నారు. మూడు శాబ్దాలుగా పెండింగ్‌లో పడ్డ మహిళా రిజర్వేషన్ బిల్లు మోదీ ప్రభుత్వం ఆమోదం తెలిపి అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పాల్గొన్నారు.

మహిళల ఉన్నతే బీజేపీ లక్ష్యం: రవికుమార్

గిర్మాజిపేట: దేశ మహిళల ఉన్నతే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తోందని, మోదీ నాయకత్వాన్ని బలపరిచి మరోసారి ఆయన్ను ప్రధాని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. బుధవారం నారీశక్తివం దన్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించేందుకు 26వ డివిజన్‌లో చార్‌బౌళి నారీ శక్తివందన్ జిల్లా అధ్యక్షుడు ఎరుకల రఘునారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రవికుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో ప్రధాని వారి అభివృద్ధి కోసం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నారన్నారు. ఇందులో భాగమే నారీశక్తి వందన్ కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో నారీ శక్తివందన్ వరంగల్ పార్లమెంటరీ కోఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ టి.కృష్ణప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ బండి సుజాత, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నం సతీష్ షా, కె.రంజి త్, కె.శిల్ప, జిల్లా నాయకులు ఎస్.నరేష్ బి.హరిశంకర్, జి.కుమార్, పి.శ్రీనివాస్, కె.మహేష్, గోవిందసింగ్ పాల్గొన్నారు.

రవికుమార్ సమక్షంలో చేరికలు..

ఖిలావరంగల్: దేశ ప్రజలంతా బీజేపీ వైపే చూస్తున్నారని, కేంద్రంలో మళ్లీ వచ్చేది మోదీ ప్రభుత్వమేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. బుధవారం మధ్యకోటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సుంకరి రాజును బీజేపీ సీనియర్ నాయకుడు, 38వ, డివిజన్ అధ్యక్షుడు అంకాల జనార్దన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. రాజుకు శివనగర్‌లో రవికుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

మహాశివరాత్రి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

పోచమ్మమైదాన్, మార్చి 6: వరంగల్ గురుధామంలో (సప్తధామ్) 8న జరిగే మహా శివరాత్రి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు శివానందగురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. పైడిపెల్లిలోని గురుధామంలో బుధవారం మహాశివరాత్రి వేడుకల వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా నిర్వహిస్తున్న విధంగానే మహా శివరాత్రి పర్వదిన వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సాయినారాయణ, ఉమాశంకర్, లయక్‌అహ్మద్, వెంకటరమణ పాల్గొన్నారు.

• కరీమాబాద్, : రంగశాయిపేట వడ్డవాడలోని అన్నపూర్ణ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి కోసం ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ చైర్మన్ ముత్తినేని రామ్మూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు వెలిదే ప్రదీప్‌శాస్త్రి, గంగు రాజేంద్రశర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

• వరంగల్ కలెక్టరేట్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో వేడుకలు నిర్వహించనున్నట్లు ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు తెలిపారు. శివరాత్రి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ శివరామకృష్ణ ప్రసాద్, చకిలం ఏకాంబరం, అడ్డగూడి వెంకటేశ్వర్లు, బెండెల అర్జున్‌రావు,డాక్టర్ వొద్దిరాజు శార్వాణి, తోట శివకుమార్, విజేందర్‌రెడ్డి, యుగంధర్ పాల్గొన్నారు.



కరీమాబాద్‌లో మాట్లాడుతున్న చంద్రశేఖర్ ఆర్యా

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

కరీమాబాద్, మార్చి6: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ 320 ఎఫ్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా అన్నారు. బుధవారం కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్వెస్ట్ ఇంప్లిమెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్ మార్గం ప్రభాకర్, ఆర్.ప్రకాష్, జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశురాములు పాల్గొన్నారు.

● సంగెం : కాపుల కనుపర్తి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యాభివృద్ధి, విద్యలో నైపుణ్యతపై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్-320ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో జిల్లా లయన్స్ క్లబ్ ప్రతినిధులు చంద్రశేఖర్ ఆర్యా, మార్గం ప్రభాకర్, ఆర్.ప్రకాష్, పరశురాములు పాల్గొన్నారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్‌టౌన్, మార్చి6: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి కె. సంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మహాశివరాత్రి, శనివారం మహాశివరాత్రి మరుసటి రోజు జాగరణ, వారంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం నుంచి మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని కార్యదర్శి సంగయ్య ఆ ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన ఆరెల్లి శ్రీనివాస్



సీఎం, మంత్రితో శ్రీనివాస్

కరీమాబాద్, మార్చి 6: ఉర్సు ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆరెల్లి శ్రీనివాస్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావుల ఆధ్వర్యంలో శ్రీనివాస్‌ను పార్టీలోకి ఆహ్వానించారు.

సీఎం కలిసిన గీసుగొండ ఎంపీపీ



సీఎంకు బొకే అందచేస్తున్న సౌజన్య

గీసుగొండ,మార్చి 6: సీఎం రేవంత్‌రెడ్డిని గీసుగొండ ఎంపీపీ, పీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మండలంలో పలు అభివృద్ధి పనులు వివరించి నిధుల ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

బాధ్యతలు స్వీకరించిన మామునూరు ఏసీపీ

సంగెం, మార్చి 6 : మామునూరు ఏసీపీ గా తిరుపతి బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. హైదరాబాద్ ఇంటలిజెన్స్ ఏసీపీగా పనిచేసి బదిలీపై తిరుపతి వచ్చి బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ ఏసీపీగా పని చేసిన సతీష్ బాబు డీజీపీ కార్యాలయానికి బదిలీ పై వెళ్లిన విషయం విదితమే. అనంతరం తిరుపతి సీపీ అంబర్ కిశో ర్ ఝాను మర్యాద పూర్వకంగా కలిశారు.

గీసుగొండ ఎస్సైగా జానీపాషా

గీసుగొండ, మార్చి 6: గీసుగొండ నూతన ఎస్సైగా షేక్‌జానీపాషా బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంతో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ స్వేతారెడ్డి బదిలీ కాగా ఆమె స్థానంలో నెక్కొండలో విధులు నిర్వహిస్తున్న జానీపాషా గీసుగొండకు బదిలీ అయ్యారు. అనంతరం సీఐ బాబులాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇద్దరు ఏసీపీల బదిలీ

హనుమకొండ క్రైం, మార్చి 6: రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట డీజీపీ రవిగుప్త బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు ఏసీపీలకు స్థానచలనం కల్పించారు. బదిలీ అయిన వారు ఒకటి, రెండు రోజుల్లో రిపోర్టు చేయాలని డీజీపీ ఆదేశించారు. బదిలీ అయిన వారిలో బి.నందిరాంనాయక్ సీఐడీ విభాగం నుంచి వరంగల్ ఏసీపీగా, ప్రస్తుతం వరంగల్ ఏసీపీగా పని చేస్తున్న బోనాల కిషన్‌ను ఏసీపీ సీసీఎస్ నిజామాబాద్‌కు బదిలీ చేశారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన

కరీమాబాద్, మార్చి 6: ఓటింగ్ విధానాలు, ఓటింగ్ శాతం, ఎన్నికల సరళిపై శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికలపై అవగాహన కల్పించడంలో భాగంగా వ్యాసరచన, ఉపన్యాసం, డ్రాయింగ్, క్విజ్ పోటీలతో పాటు, పోలింగ్ సరళిపై విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఆడెపు రవీందర్, సత్యనారాయణ, తస్లీమా, నఫీజ్ హాజీ పాషా, రామాస్వామి, లక్కతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

10న 'గిరిజన' ప్రవేశ పరీక్ష

గిర్మాజిపేట, మార్చి 6 : తెలంగాణ గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ ప్రవేశాలకు రెండో లెవెల్ ప్రవేశ పరీక్ష 10వ యాకుత్‌పురాలోని గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. గతనెల 18న జరిగిన మొదటి లెవెల్ ప్రవేశ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు 10న జరిగే రెండో లెవెల్ ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్‌లను www.tgtwgurukulamtelangana వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

ఆర్థికాభివృద్ధికి దోహదం : రేవూరి



సోమ్లాతండాలో సొసైటీ గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సంగెం, మార్చి6: రైతుల ఆర్థికాభివృద్ధికి సహకార వ్యవస్థ ఎంతగానో దోహదపడుతోందని పరకాల ఎమ్మెల్యే రేగూరి ప్రకాష్‌రెడ్డి చెప్పారు. తీగరాజుపల్లి పరిధిలోని సోమ్లతండాలో ఐవోబి ఆర్థిక సహకారంతో రూ.18.50 లక్షలతో కాపులకనపర్తి పీఏసీఎస్ గోదాంను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే పేరుపై ఇటీవల రూపొందించిన ఆడియోను తీగరాజుపల్లిలోని ఆదర్శ పాఠశాలలో ఆవిష్కరించారు. అంతకుముందు తీగరాజుపల్లిలో బొడ్రాయికి ఎమ్మెల్యే పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సహకార వ్యవస్థ పునఃనిర్మాణానికి రైతులందరూ సహకరించాలన్నారు. రాష్ట్రంలో 90శాతం సహకార సంఘాలు నిర్వీర్యమయన్నారు. కార్యక్రమంలో సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి, సొసైటీ చైర్మన్ దొమ్మటి సంపత్, సీఈవో రమణాచారి, ఎంపీటీసీ రంగారాజు నర్సింహస్వామి, సొసైటీ వైస్ చైర్మన్ ముడిదె శ్రీను, మాజీ సర్పంచు మంగ్యా నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చొల్లేటి మాధవ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ పాల్గొన్నారు.

అప్పులబాధతో ఆత్మహత్య



కుమారస్వామి(ఫైల్)

సంగెం, మార్చి6: అప్పుల బాధ తో ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం గవిచర్లలో చోటుచేసుకుంది. ఎస్ఐనరేష్ కథనం ప్రకారం. గుళ్లపల్లి కుమారస్వామి(43)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానికంగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంటి నిర్మాణం కోసం అప్పు చేయగా, అది తీర్చే మార్గం కనిపించకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోని ఇనుప పైపులకు చీరతో ఉరి వేసుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి యశోద ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఆస్ట్రేలియా దేశస్తుల పూజలు



అమ్మవారిని విదేశీయుల పూజలు

వరంగల్‌టౌన్, మర్చి 6: దయానందకాలనీ కనకదుర్గా మాతా దేవాలయంలో బుధవారం ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో ఇద్దరి ఆస్ట్రేలియా మహిళలు అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దయానందకాలనీకి ఆకుల భరత్ ఆస్ట్రేలియాలో పెట్రోలియం ప్రాడెక్టులో మేనేజర్‌గా పని చేస్తున్న ఆకుల భరత్ కుమార్ క్రిష్ణప్రియ దంపతులకు ఆస్ట్రేలియాకు చెందిన బాబ్బి, కేవైట్ దగ్గరి పరిచయస్థులు కావడంతో వరంగల్‌కు విచ్చేశారు.



తాళిబొట్టు భక్తులకు చూపిస్తున్న అర్చకులు

ఘనంగా శివకళ్యాణం

వరంగల్‌టౌన్, మార్చి 6: కాశిబుగ్గ శ్రీ కాశీవిశ్వేశ్వరాలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహా శివరాత్రి మహోత్సవాల్లో బుధవారం శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. సూరిశెట్టి ఈశ్వరయ్య, శ్రవణ్‌కుమార్, వసుందర మోహన్‌రావు దంపతులు, భువనేశ్వరీ సంతోష్ దంపతులు పాల్గొన్నారు. అలాగే ఉదయం మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, గుండేటి కృష్ణమూర్తి, శ్రీరాముల పెద్దన్న, మాజీ కార్పొరేటర్ బయ్యస్వామి, ప్రధాన కారదర్శి జగదీశ్వర్ పాల్గొన్నారు.

బల్దియాలో రెవెన్యూ మేళా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), మార్చి 6: వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం రెవెన్యూ మేళా జరిగింది. రెవెన్యూ సంబంధిత అంశాలపై మొత్తం 16 మంది వినతులు సమర్పించారు. పరిష్కార చర్యలు చేపట్టాలని బల్దియా అదనపు కమిషనర్ అనిసూర్ రశీద్ సిబ్బందికి సూచించారు.

నేడు నీటి సరఫరా బంద్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ)మార్చి 6: దేశాయిపేట పరిధిలోని పాలు ప్రాంతాలు గురువారం తాగునీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశాయిపేట, పోచమ్మమైదాన్, ఆటోనగర్, కొత్తవాడ, ఎల్‌బీ నగర్, చార్‌బౌళి, మట్టెవాడ, కాశిబుగ్గ, జీఆర్ గుట్ట, లేబర్ కాలనీ, క్రిస్టియన్ కాలనీ, ఎస్ఆర్‌టీ, అబ్బనికుంట, హంటర్‌రోడ్డు ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సవరణకు ఆధారాలు సమర్పించాలి



సవరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అనిసూర్ రశీద్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), మార్చి 6: ప్రజాలన దరఖాస్తుల సవరణకు సంబంధిత ఆధారాలతో కేంద్రాలకు రావాలని బల్దియా అదనపు కమిషనర్ అనిసూర్ రశీద్ సూచించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు నగరంలోని పలు ప్రజాపాలన దరఖాస్తు సవరణ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సెల్‌ఫోన్ నెంబరు తదితర ఆధారాల సమకూర్చుకొని సెంటర్ల వస్తే ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

కరీమాబాద్, మార్చి 6: కొత్తగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షులు వారి డివిజన్లలో బీజేపీ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సూచించారు. బుధవారం 42వ డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన కర్నె వాసుదేవ్ ప్రదీప్‌రావును నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌ను కర్నె వాసుదేవ్, ఇతర నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధం నరేష్, కర్నె రవీందర్, సంజీవ్‌రాజు, నాగరాజు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే అడహక్ కమిటీ

అధ్యక్షుడిగా అనిల్‌కుమార్‌గౌడ్



వరంగల్‌టౌన్, మార్చి 6: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(హెచ్-143) ఉమ్మడి వరంగల్ జిల్లా అడహక్ కమిటీ అధ్యక్షుడిగా కక్కెర్ల అనిల్‌కుమార్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీ సాగర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాబో యే రెండు నెలల్లో జిల్లాలో జరిగే పూర్తిస్థాయి కమిటీ ఎంపిక ప్రక్రియలో క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

వరంగల్ సిటీ, మార్చి 6: చింతల్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గడల రమేష్‌ను మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పరామర్శించారు. మోకాలు గాయంతో బాధపడుతున్న రమేష్ నివాసానికి బుధవారం వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మసూద్, కార్పొరేటర్ భోగి సురేష్ సువర్ణ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు యాకయ్య ఉన్నారు.

తెలంగాణలో బీఎల్ఎఫ్ పోటీ

బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రకాష్

గిర్మాజిపేట, మార్చి6: తెలంగాణలోని అన్ని పార్లమెంట్ స్థానాల్లో బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ పోటీ చేస్తోందని బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ చెప్పారు. బీజేపీ పాలనలో అగ్రవర్ణాల పెత్తనం కొనసాగుతోందని, సామాజిక అణచివేత జరుగుతోందని ఆరోపించారు. బుధవారం హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లోని ఓంకార్ భవన్‌లో నర్రా ప్రతాప్ అధ్యక్షతన వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ జనాభాలో 93 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చట్టసభలలో తగిన వాటా రాకుండా మోదీ ప్రభుత్వంతఈవర్గాలను అణచివేస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వ అప్రజాస్వామిక, అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న గొంతులను అణిచివేస్తున్నారన్నారు. నర్రాప్రతాప్ కన్వీనర్, మాస్ సావిత్రి కోకన్వీనర్, సభ్యులుగా నగేష్, రవి, సంధ్య, రవిందర్, జగదీశ్వర్, అరుణ్, ఎమ్మెస్ రావులతో వరంగల్ పార్లమెంట్ బీఎల్ఎఫ్ ఎన్నికల కమిటీని నియమించారు. కంచ వెంకన్న కన్వీనర్, బాబురావు కో కన్వీనర్, సభ్యులుగా రాగసుధ, చంద్రయ్య, మోహన్‌రావు, రాజమౌళి, ఉపేందర్, బిచ్చానాయక్, బి.రాజమౌళిలతో మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల కమిటీని నియమించారు. సమావేశంలో ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి జి.రవి, కేంద్ర కమిటీ సభ్యులు జి.కుమారస్వామి, వరంగల్ జిల్లా కార్యదర్శి పి.రమేష్, నాయకులు హంసారెడ్డి, సునీల్, నాగార్జున, కొమురయ్య, వెంకన్న, ఇస్మాయిల్, గోవర్దన్ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL గురువారం 7 మార్చి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీవో

ఖానాపురం, మార్చి 6 : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జీసీడీవో ఫ్లోరెన్స్ అన్నారు. మండలంలోని అశోక్ నగర్‌లో కస్తూర్బా గురుకుల పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్, పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలకు ఏ విధంగా సిద్ధమవుతున్నారో తెలుసుకుని, ఉత్తమ ఫలితాలు సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అదే విధంగా విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల మెనూ, నాణ్యతను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలలో 100శాతం ఎన్‌రోల్‌మెంట్ ఉండేవిధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో మేనక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, మార్చి 6 : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాలను బుధవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా వర్ధన్నపేట మండల పరిధిలోని రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రగతిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే రైతునేస్తం పేరిట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో వినూత్న కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారని తెలిపారు. రాష్ట్రంలోని రైతు వేదికల్లో దృశ్య, శ్రవణ సేవలను రైతు నేస్తం పేరిట సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు బుధవారం సచివాలయం నుంచి ప్రారంభించినట్లు వివరించారు. శాస్త్రవేత్తలు, రైతులు, అధికారులు మధ్య ప్రత్యక్ష, పరస్పర విషయ మార్పిడికి జూమ్, యూ ట్యూబ్ లైవ్ ద్వారా రైతు వేదికలకు లింక్ చేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపినట్లు చెప్పారు. డిజిటల్ సేవలలో భాగంగా శాస్త్రవేత్తలు, నిపుణులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ సెల్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, మండల, గ్రామ పార్టీ నాయకులు, స్థానిక మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు : ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, మార్చి 6 : వేసవికాలం సమీపిస్తున్నందున నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశించారు. బుధవారం వర్ధన్నపేట పురపాలక సంఘంలో మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. ఎండకాలం వస్తున్నందున శానిటేషన్ పనులపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, కమిషనర్ ఇ.జోనా, వార్డు కౌన్సిలర్లు సమ్మెట సుధీర్, కొండేటి అనిత, భూక్య సరిత, మంచాల రామకృష్ణ, తుమ్మల రవీందర్ అధికారులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల సౌకర్యం కోసం సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు 8096107107 ఫోన్ నెంబర్‌కు ఫిర్యాదు అయినా, సూచనలు అయినా తెలియజేయవచ్చన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఈ నెంబర్ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

• మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



రాయపర్తిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

రాయపర్తి, మార్చి 6 : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల విస్తృతస్థాయి సమావేశంలో ఎర్రబెల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు నాయకులు, కార్యకర్తలు నిశితంగా పరిశీలించాలని సూచించారు. ప్రజలు అపోహలకు గురి కాకుండా మంచి నిర్ణయం తీసుకునే విధంగా వారిని చైతన్య పరచాలన్నారు. కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని నమ్ముకుని ఉన్న కార్యకర్తలకే భవిష్యత్తు ఉంటుందని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎంపీ ఎన్నికల్లో మంచి మెజార్టీని తెచ్చేలా చూస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. అనంతరం మండలంలోని కొండూరు గ్రామంలో ఇటీవల పొలినేని శ్యామ్‌రావు నానమ్మ అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, మండల ఎన్నికల ఇంచార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగపూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

‘ఎలాంటి ఫీజు లేకుండా ఎల్ఆర్ఎస్ అమలు చేయాలి’



జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నర్సంపేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వర్ధన్నపేట, మార్చి 6 : ఎన్నికల సమయంలో ఎల్ఆర్ఎస్ ఉచితమని చెప్పి ఇప్పుడు ఫీజు వసూలు చేయడం ఎంత వరకు సబబు అని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ అన్నారు. బుధవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని జాతీయ రహదారిపై బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎలాంటి ఫీజు లేకుండానే ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల నుంచి రూ.20వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటున్నదని ఆరోపించారు. గతంలో ఎల్ఆర్ఎస్ వద్దు, భూములు ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ మాట తప్పిందన్నారు. అప్పుడు అడ్డగోలు మాటలు మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఇప్పుడు నోరు ఎందుకు తెరవడం లేదో చెప్పాలన్నారు. ఎల్ఆర్ఎస్ అంటే ప్రజల నుంచి డబ్బులు దోచుకోవడమే అన్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ప్రజల నుంచి ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారో చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ వద్దు అంటూ మాట్లాడిన రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి వంటి కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 25.44 లక్షల మందిపైన కనీసం లక్ష రూపాయల భారం పడనుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్ల క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రజల నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండానే ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్ల రెగ్యులరైజేషన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీపీ అప్పారావు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కుమారస్వామి, రాకేశ్‌రెడ్డి, రాములు, యాకయ్య, కుమారస్వామి, మనోజ్‌గౌడ్, ఏకాంతం, మోహన్‌రావు, ఎలేందర్‌రెడ్డి, రాజమణి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

• మునిసిపాలిటీ ఎదుట బీఆర్ఎస్ ధర్నా

నర్సంపేట టౌన్ : భూములను ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తానని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక విస్మరించి ప్రజలపై భారం మోపడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నామమాత్రపు ఫీజుతో ఎల్ఆర్ఎస్ చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలనడంతో 25లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. దీనిపై ఆనాడు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు కోర్టులో కేసువేసి నిలిపివేయించారన్నారు. నేడు అధికారంలోకి రాగానే మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతూ 2024, మార్చి 31 లోపు ఎల్ఆర్ఎస్ చెల్లించాలని ఒత్తిడి చేయడం సమంజసం కాదన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా భూములను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, గోనె యువరాజు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన నిధులతో పనులు చేపట్టండి

• మండల సభలో తీర్మానం



మండల సభలో మాట్లాడుతున్న విద్యుత్ ఏఈ చిరంజీవి

నెక్కొండ, మార్చి 6 : మండలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకుగాను గత బీఆర్ఎస్ ప్రభుత్వం వివిధ శాఖల నుంచి రూ.85కోట్ల నిధులను మంజూరీ చేసిందని, ఆ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలంటూ, రైతులకు సబ్సిడీ పనిముట్లు అందించాలని మండల సభలో తీర్మానంచేశారు. ఎంపీపీ జాటోతే రమేశ్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నెక్కొండ మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి పనులు చేపట్టుటకు గాను ప్రభుత్వం నుంచి దాదాపు రూ.85 కోట్ల నిధులను సాంక్షన్ చేయించారని ఎంపీటీసీలు సంగని సూరయ్య, కర్పూరపు శ్రీనివాస్, గుండవరపు అపర్ణ, బానోతు దస్రునాయక్, యాసం రమాదేవి చెప్పారు. ఆ నిధులతో పనులు చేపట్టడంతోపాటు అదనంగా నిధుల మంజూరీకి కృషి చేయాల్సిన నర్సంపేట ఎమ్మెల్యే అలా చేయకుండా సాంక్షన్ అయిన నిధులను దారి మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. మండలంలో రోడ్డు సౌకర్యం లేని 46 గిరిజన తండాలను గుర్తించిన గత ప్రభుత్వం బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.39కోట్లను సాంక్షన్ చేయించినట్లు చెప్పారు. కానీ, ఈ నిధులను మండలంలోని చంద్రుగొండ క్రాస్‌రోడ్డు నుంచి చంద్రుగొండ వరకూ డబుల్ రోడ్డు నిర్మాణానికి, నెక్కొండ - కేసముద్రం రోడ్డు మరమ్మతులకు కేటాయించడానికి అధికార పార్టీ నేతలు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. మండలంలోని రైతుకుల 50 శాతం సబ్సిడీపై రూ.73కోట్ల వ్యవసాయ పనిముట్లు అందించుటకు గత ప్రభుత్వం సిద్ధం చేశారని, పనిముట్లు పొందుటకు 120 మంది రైతులు రూ. 1 కోటి 20 లక్షల డీడీలను కూడా ప్రభుత్వానికి అందించినా, నేటికి రైతులకు పనిముట్లు సరఫరా చేయలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో పంటలు ఎండి, విద్యుత్ మోటర్లు కాలిపోతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. మండలంలో రెండు వేల మంది రైతులకు సంబంధించి రూ.4కోట్లు రైతుబంధు వారి ఖాతాల్లో పడాల్సి ఉందని ఏఈవో నాగరాజు తెలిపారు. ఈ నెల చివరి వరకూ సాగు నీరు అందుతుందని ఇరిగేషన్ శాఖాధికారులు తెలిపారు. గ్రామాల్లో తాజా మాజీ సర్పంచ్‌లు లక్షల రూపాయల అభివృద్ధి పనులను చేపట్టారని, వాటికి సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించాలంటూ సభలో తీర్మానం చేయాలని ఎంపీటీసీలు చేసిన డిమాండ్‌ను సభ ఆమోదించింది. ఈ సభలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో సునీల్‌కుమార్, వివిధ శాఖల ఏఈలు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

నర్సంపేటలో ఏడీసీని ఏర్పాటు చేయాలి

నర్సంపేట, మార్చి 6 : నర్సంపేటలో అదనపు జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టు న్యాయమూర్తిని బుధవారం నర్సంపేటకు చెందిన న్యాయవాదులు కలిసి వినతిపత్రం అందజేశారు. నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేశ్‌యాదవ్, సీనియర్ న్యాయవాదులు అంబటి శ్రీనివాస్, దాసి రమేశ్, కొడిదెల సంజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ కార్యదర్శి పుట్టపాక రవి, బండి శివ హైకోర్టుకు వెళ్లి వరంగల్ జిల్లా పోర్టు పోలియో న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్‌ను కలిశారు. త్వరలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్ అన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి...

• ఇద్దరికి గాయాలు

రాయపర్తి, మార్చి 6 : ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కొలన్‌పెల్లి గ్రామ శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని ఆరె గూడెం నుంచి దుర్గమ్మ ఉత్సవాల్లో పాల్గొని వస్తున్న క్రమంలో కొలన్‌పెల్లిశివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో బైక్‌పైవస్తున్న తల్లి అంగోతు దేవెల్లి, కుమారుడు జగన్ కిందపడడంతో వారికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వీరు వర్ధన్నపేటలోని గుబ్బెడి తండాకు చెందిన వ్యక్తులని తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

11 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

పర్వతగిరి, మార్చి 6 : ఈ నెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామంలో కొలను వేంకటేశ్వరస్వామి ఆలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. బుధవారం ఈ మేరకు ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం ఉంటుందని, చివరి రోజు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

చెన్నారావుపేట, మార్చి 6 : మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన లక్కనర్సు రాకేష్ అనే వ్యక్తి, గ్రామంలో ఇతరుల వ్యక్తుల నుంచి కొనుగోలు చేసిన సుమారు 13 క్వింటాళ్ల రేషన్ బియ్యం తన ఇంటి ప్రాగంణంలో అక్రమంగా నిల్వ చేశాడు. కొందరు ఇచ్చిన సమాచారం మేరకు రాకేష్ ఇంటి వద్ద పోలీసులు సోదాలు నిర్వహించి అక్రమ రేషన్ బియ్యం ను పట్టుకున్నారు. అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మహిళా దినోత్సవ కార్యక్రమాలు

దుగ్గొండి, మార్చి 6 : మండల కేంద్రంలోని సమైక్య కార్యాలయంలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గుజ్జుల రాజ్‌కుమార్, సమైక్య అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి రజిత, కోశాధికారి సావిత్రి, సీటీవో ఆడిటర్ వెంకట్, సీసీలు బాబు, పద్మ, సంధ్యారాణి, అక్కౌంటెంట్ అరుణ, ఆపరేటర్ రంజిత్, వివిధ గ్రామాల వీవోలు పాల్గొన్నారు.

మరోమారు మేడిగడ్డకు ఎన్‌డీఎస్ఏ బృందం

(3వ పేజీ తరువాయి)

డ్యామ్‌సేఫ్టీ అథారిటీకి లేఖ రాయడంతో ప్రస్తుతం నిపుణుల కమిటీ అధ్యయనానికి శ్రీకారం చుట్టింది...

బృందం పర్యటన సాగనుందిలా..

కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ అన్నారం బ్యారేజీలను అధ్యయనం చేసేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం గురువారం రోజంతా మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులను సుదీర్ఘంగా అధ్యయనం చేయనుంది. ఉదయం 9గంటలకు ఎన్‌డీఎస్ఏ బృందం మేడిగడ్డ చేరుకొని అల్పాహారం తర్వాత 9.30 గంటలకు బ్యారేజీ తనిఖీల ప్రక్రియ ప్రారంభించి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు దెబ్బతిన్న పిల్లర్లు, డిజైన్లలోపాలు, నిర్మాణ నాణ్యత, మరమ్మతులకు గల అవకాశాలు లాంటి అంశాలపై విస్తృతంగా అధ్యయనం చేస్తుంది. మధ్యాహ్నం ఒకటిన్నరకు మేడిగడ్డ వద్ద భోజనం ముగించుకుని రెండున్నర గంటలకు అన్నారం సరస్వతి బ్యారేజ్ వద్దకు చేరుకుంటుంది. మధ్యాహ్నం 3.15 నుండి సాయంత్రం ఆరున్నర గంటల వరకు సరస్వతి బ్యారేజ్‌ని పరిశీలించి నేరుగా రామగుండం వెళుతుంది. ఆ మరుసటి రోజు సుందిళ్ల బ్యారేజ్‌ని తనిఖీ చేయనున్నారు.

నిపుణుల కమిటీ సిఫారసులే కీలకం

దెబ్బతిన్న మేడిగడ్డ అన్నారం బ్యారేజీల భవితవ్యాన్ని ఎన్‌డిఎస్ఏ నిపుణుల బృందం ఇచ్చే నివేదికలే తేల్చనున్నాయి.

నిపుణుల కమిటీ ప్రధానంగా 19 అంశాలపై సమాచారం అడిగినందున తనిఖీలలో వాటిపైనే ప్రధానంగా ఫోకస్ పెట్టే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ప్రాజెక్టు డిజైన్ మొదలు క్వాలిటీ కంట్రోల్, నిర్వహణ లాంటి అంశాలపై దృష్టి సారించే అవకాశం ఉంది. దెబ్బతిన్న ఏడో బ్లాకులోని పిల్లర్ల మరమ్మతులకు ఏ మేరకు అవకాశాలు ఉన్నాయి? మరమ్మతులు చేయిస్తే భవిష్యత్తులో ప్రాజెక్టు పరిస్థితి ఎలా ఉంటుంది? దెబ్బతిన్న పిల్లర్ల స్థానంలో మళ్లీ పునర్నిర్మించాలా? వద్దా? అనే అంశాలను నిపుణులు తేల్చే అవకాశాలున్నాయి.

ఏనుమాముల మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్‌టౌన్, మార్చి 6: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి కె. సంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మహాశివరాత్రి, శనివారం మహాశివరాత్రి మరుసటి రోజు జాగరణ, వారంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం నుంచి మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని కార్యదర్శి సంగయ్య ఆ ప్రకటనలో తెలిపారు.

భవాని మొబైల్, ఎలక్ట్రానిక్స్ షాప్ ప్రారంభం



షాప్‌ను ప్రారంభిస్తున్న ఈగ మల్లేశం

వర్ధన్నపేట, మార్చి 6 : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన భవాని మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ సెల్ షాపును చిన్న తరహా పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం బుధవారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ దమ్మన్నపేట గ్రామానికి చెందిన గజవెల్లి ప్రభాకర్ కుమారుడు ప్రకాశ్ భవాని మొబైల్స్ పేరిట షాప్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ తుమ్మల రవీందర్, సిలువేరు కుమారస్వామి, తూళ్ల కుమారస్వామి, కరిమిల్ల సంపత్‌రావు, పులి శ్రీనివాస్, మల్లెపాక భాస్కర్, నాగెల్లి సురేశ్, కొండేటి శ్రీనివాస్, కొండేటి శ్రీకాంత్, హనుమకొండ సుధాకర్, ఐత యాకాంతం, జాగిల్ల వీరస్వామి, రామగిరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో గరీబోళ్లకు ఇండ్లపట్టాలు ఇవ్వాలి

నర్సంపేట, మార్చి 6: ప్రజాపాలనలో గరీబోళ్లకు (గుడిసెవాసులకు) పట్టాలు అందించి ఆదుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పి) జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయదీప్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో బుధవారం ఎంఎస్‌పి నియోజకవర్గ కో-కన్వీనర్ తడుగుల విజయ్ అధ్యక్షతన గరీబోళ్ల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లెపెల్లి ప్రణయదీప్‌తో పాటు డీబీడీఏఎస్ జాతీయ అధ్యక్షుడు అందె రవి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని ఆయన కోరారు. పట్టణంలోని 813 సర్వే నంబర్ ప్రభుత్వం భూమిలో మూడేళ్ల క్రితం గుడిసెలు వేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేదలకు పట్టాలు అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. సభ అనంతరం మానవ ధర్మ ప్రవక్త సంత్ గురురవిదాస్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గుంపుల మాలతిలత, మమత, బోయిని నారాయణ, మునిగె యాకూబ్, జలగం రమేశ్, మాదాసి బాబు, దామెర సుధాకర్, సిద్దబోయిన సాంబయ్య, కత్తి రాములు, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చేదు అనుభవం

వర్ధన్నపేట, మార్చి 6 : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మునిసిపాలిటీ పరిధిలోని డీసీ తండాలో బుధవారం ఓ గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. అదే తండాకు చెందిన గిరిజనవాసులు ఎమ్మెల్యే నాగరాజును నిలదీయడంతో ఖంగు తిన్నారు. బీఆర్ఎస్ పార్టీలో పలు పదవులు అనుభవించి గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బలపర్చిన వారిని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో ఎలా చేర్చుకున్నారని ఎమ్మెల్యేను నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులపై సైతం వారు ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికార పార్టీ ప్రజాప్రాతినిధులు, నాయకులు నివ్వెరబోయారు. ఎట్టకేలకు పోలీసులు, అధికారులు వారికి నచ్చజెప్పి అక్కడ నుంచి పంపివేయడంతో వివాదం సద్దు మణిగింది.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రాన్ని చదువుతున్న వేం నరేందర్‌రెడ్డి

నెక్కొండ, మార్చి 6 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణితో రైతులు అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొన్నారని అలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి మండలంలోని సాయిరెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పెండ్లి జెన్నయ్య బుధవారం వినతిపత్రాన్ని అందించారు. రైతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు.

కొనసాగుతున్న నాటక పోటీలు



మూల్యం నాటకంలో ఓ సన్నివేశం

వర్ధన్నపేట, మార్చి 6 : భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటక పోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం విజయవాడకు చెందిన మైత్రి కళా నిలయం వారు బంధం అనే సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. మనిషి జీవితం బంధంతో మొదలవుతుందని, తల్లిదండ్రులు, తోబుట్టువులు, మిత్రులు, గురువులు, భార్యాబిడ్డలు ఇలా ఎన్నో బంధాలు ఉంటాయి కానీ, కడదాక కలిసి ప్రయాణం చేసే భార్యాభర్తల బంధం ఎంతో పటిష్టమైనదనే కథాంశంతో నాటకాన్ని టివి.పురుషోత్తం, రత్నకుమారి, ప్రసాద్, బాబురావు, రాధాకృష్ణ అత్యద్భుతంగా నటించి మెప్పించారు. మాడుగుల రామకృష్ణ రచన చేయగా, టివి.పురుషోత్తం దర్శకత్వం వహించారు. రెండవ నాటకంగా హైదరాబాద్‌కు చెందిన గోవాడ క్రియేషన్స్ వారు మూల్యం ప్రదర్శించారు. శ్రీసింహాప్రసాద్ రచనచేయగా, డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వం వహించారు. మూల్యం నాటికలో నేటి సమాజంలో ఆడపిల్లల మీద అడుగడుగునా రకరకాల ఆంక్షలు విధించడం, జననం మొదలుకొని పెంపకం, చదువు, సమాజ వర్తన, పెళ్లి, ఉద్యోగం, స్వేచ్ఛ తదితర విషయాల్లో వివక్ష చూపే సన్నివేశాలతో మూల్యం కథ సాగుతుంది.

పోలీస్‌స్టేషన్‌కు టెన్త్ ప్రశ్న పత్రాలు

చెన్నారావుపేట, మార్చి 6: ఈనెల 18 నుంచి జరగనున్న పదో తరగతి ప్రశ్న పత్రాలు పోలీస్ స్టేషన్‌కు బుధవారం చేరుకున్నాయి. సంబంధిత అధికారులు ప్రశ్న పత్రాలను స్టేషన్‌లో భద్రపరిచారు.కార్యక్రమంలో కస్టోడియన్ అధికారి పాపమ్మ, చంద్రమౌళి, వెంకట్రామనర్సయ్య, ప్రసన్నలక్ష్మీ, రూట్ ఆఫీసర్ సారయ్య, ప్రసన్నలక్ష్మి, పొలెపల్లి రవి, సీఆర్పీలు బాలు, స్వామి, అటెండర్ స్వర్ణలతలు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



పరీక్ష కేంద్రంలో కలెక్టర్ ప్రావీణ్య

రాయపర్తి, మార్చి 6 : ఇంటర్మీడియల్ పరీక్షలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీచేశారు. సెంటర్‌లోని గదులను తనిఖీచేసి, విద్యార్థులు రాస్తున్న పరీక్ష సరళిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు జరిగేలా చూడాలని, మాస్ కాపీయింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ముందు జాగ్రత్తగా ప్రతీ ఒక్కరిని తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

నర్సంపేట, మార్చి 6: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ చేరికల కమిటీ ఇన్‌చార్జి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం నారిశక్తి వందన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఒక గిరిజన మహిళను రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల ను అమలు చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రభారి సత్యపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, నియోజక వర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహారావు, నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు ఏసీపీల బదిలీ

హనుమకొండ క్రైం, మార్చి 6: రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్త బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ క్రమంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు ఏసీపీలకు స్థాన చలనం కల్పించారు. బదిలీ అయిన వారు ఒకటి, రెండు రోజుల్లో రిపోర్టుచేయాలని డీజీపీ ఆదేశించారు. బదిలైన వారిలో బి.నందిరాంనాయక్ సీఐడీ విభాగంనుంచి వరంగల్ ఏసీపీగా, ప్రస్తుతం వరంగల్ ఏసీపీగా పనిచేస్తున్న బోనాల కిషన్‌ను ఏసీపీ సీసీఎస్ నిజామాబాద్‌కు బదిలీ చేశారు.